సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 23 । డిసెంబర్ । 2023



అభిమానం.. రక్తదానం

సీఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా జిల్లావ్యాప్తంగా రక్తదాన శిబిరాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. 8లో ▸



శోభాయమానం.. గిరి ప్రదక్షిణం

ద్వారకాతిరుమల శ్రీవారి గిరి ప్రదక్షిణ మహోత్సవం వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణలు మార్మోగాయి. 8లో ▸

ప్రత్యేక రైళ్లు

సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే కాకినాడ–కాచిగూడ మధ్య ఈనెల 28 నుంచి వచ్చేనెల 26 వరకు ప్రత్యేక రైళ్లను నడుపనుంది. 8లో



న్యూస్‌రీల్

కరోనా.. జర జాగ్రత్త

ఏలూరులో వైద్యుడికి పాజిటివ్



ఏలూరు జీజీహెచ్‌లో అత్యవసర సేవలపై మాక్‌డ్రిల్ చేపట్టిన వైద్యులు

ఏలూరు టౌన్: మహమ్మారి కరోనా మరోసారి విజృంభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో ఏలూరు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఏలూరు జీజీహెచ్‌లో ప్రత్యేకంగా కరోనా వార్డులను సిద్ధం చేశారు. అలాగే అత్యవసర సేవలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఏలూరులో ఒక వైద్యుడికి కరోనా సోకటంతో ఆయన ఆశ్రం ఆస్పత్రిలో వైద్యం పొందారు. స్వల్ప లక్షణాలు కలిగిన వైద్యుడి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారు. ఆయన ఆరోగ్యస్థితి సాధారణంగానే ఉందని వైద్యులు చెబుతున్నారు.

జీజీహెచ్‌లో మాక్‌డ్రిల్ : ఏలూరు జిల్లా కేంద్రం సర్వజన ఆస్పత్రిలో కరోనా సేవలకు సంబంధించి అత్యవసర చర్యలు చేపట్టారు. డీఎంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ఠ, ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓ, వైద్యులు బృందం సర్వం సిద్ధం చేస్తోంది. కేసులు పెరిగితే రోగులకు అత్యవసర సేవలు ఎలా అందించాలనే అంశాలపై శుక్రవారం మాక్‌డ్రిల్ చేపట్టారు. ఆస్పత్రిలోని కరోనా వార్డులో పూర్తిస్థాయిలో బెడ్లు, ఆక్సిజన్ సరఫరా, పీపీ కిట్లు, మందులు సమకూర్చడంతో పాటు నిపుణులైన వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. జిల్లావ్యాప్తంగా ఏపీ వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లోనూ కరోనా వైద్యం అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్ తెలిపారు.

ఉత్తర ద్వారం.. సర్వం సిద్ధం

నేటి ఉదయం 4.30 గంటల నుంచి..



సర్వాంగ సుందరంగా ఉత్తర ద్వారం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి (చినవెంకన్న) ఆలయం ఉత్తర ద్వార దర్శనానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శనివారం ఉదయం 4.30 గంటల నుంచి స్వామివారు ఉత్తర ద్వారం వద్ద భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఈ ఉత్తర ద్వార దర్శనాన్ని రాత్రి 9 గంటల వరకు కల్పించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఇదిలా ఉంటే శుక్రవారం రాత్రి 7 గంటల నుంచి స్వామివారు గర్భాలయంలో నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించి తరించారు. నిజరూప దర్శనం కోసం వచ్చిన భక్తులతో దర్శనం క్యూలైన్లు కిక్కిరిశాయి. వీఐపీలు, వివిధ ప్రాంతాలకు చెందిన గోవింద స్వాములు, భజన మండలి సభ్యులు, సేవకులు రాత్రికే ఆలయానికి చేరుకున్నారు. అర్ధరాత్రి వరకు ఆలయంలో పూల అలంకరణల పనులు జరిగాయి.

ఈసీ సమీక్షలో కలెక్టర్, ఎస్పీ



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, జిల్లా ఎస్పీ

భీమవరం (ప్రకాశంచౌక్): విజయవాడలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు శుక్రవారం నిర్వహించిన 2024 ఓటర్ల జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ యు.రవిప్రకాష్ పాల్గొన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై ఈసీ బృందం సమీక్ష నిర్వహించింది. జిల్లాలవారీగా ఓటర్ల జాబితా, ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై కలెక్టర్ వారికి వివరించారు.

24న 'ఆడుదాం ఆంధ్ర' 3కే రన్

ఏలూరు(మెట్రో): ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌లో భాగంగా ఈనెల 24న ఆదివారం ఉదయం 6.30 గంటలకు ఏలూరులో 3కే రన్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. అదేరోజు ఉదయం 6.30 గంటలకు వట్లూరు సర్ సీఆర్ రెడ్డి మహిళా కళాశాల సమీపంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి ఇండోర్ స్టేడియం వరకు 3కే రన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొనాలని కోరారు.

రబీకి సన్నద్ధం

- జిల్లాలోని 95 వేల హెక్టార్లలో సాగు
- ఇప్పటికే 28 వేల హెక్టార్లలో నారుమడులు
- సబ్సిడీపై 888 క్వింటాళ్ల విత్తనాల పంపిణీ



తాడేపల్లిగూడెం మండలంలో సిద్ధమైన నారుమడి

సాక్షి, భీమవరం: జిల్లాలో రబీ పనులు జోరందుకుంటున్నాయి. ఇప్పటికే 31 శాతం విస్తీర్ణంలో నాట్లు వేసేందుకు రైతులు నారుమడులు సిద్ధం చేశారు. విత్తనాలు, ఎరువులకు కొరత లేకుండా వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. సబ్సిడీపై 888 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు సరఫరా చేసింది. 44,395 టన్నుల ఎరువులను సిద్ధం చేసింది.

95 శాతం విస్తీర్ణంలో..

జిల్లాలోని 90 వేల హెక్టార్లలో రైతులు రబీ సాగు చేయనున్నారు. ఈ సీజన్‌లో 95 శాతం విస్తీర్ణంలో నాట్లు పడనుండగా, ఐదు శాతం విస్తీర్ణంలో అక్కడక్కడ వెదజల్లే పద్ధతిలో సాగు జరుగుతుందని వ్యవసాయాధికారుల అంచనా. ముందుగా ఖరీఫ్ మాసూళ్లు జరిగిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, పాలకొల్లు, పోడూరు, ఆచంట మండలాల్లో రైతులు రబీ పనులు ముమ్మరం చేశారు. నారుమడుల తయారీ, నాట్లు వేసుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 28 వేల హెక్టార్లకు సంబంధించి నారుమడులు సిద్ధం చేశారు. మరో వారం పదిరోజుల్లో నాట్లు జోరందుకుంటాయని అధికారులు అంటున్నారు. తొలకరితో పోలిస్తే దాళ్వాలో ఎరువుల వినియోగం అధికంగా ఉంటుంది. ఎకరాకు మూడు బస్తాల కాంప్లెక్స్ ఎరువులు, మూడు బస్తాల వరకు యూరియా, 40 కిలోల వరకు పొటాష్ అవసరమవుతాయి. కొందరు రైతులు అవగాహనలేమితో మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల పంటకు నష్టం వాటిల్లడంతో పాటు పెట్టుబడి వ్యయం పెరిగి శ్రమ వృథా అవుతోంది. దీనిని అరికట్టి తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడుల సాధించే దిశగా వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. మిత్ర పురుగులను సంరక్షించుకుంటూ అవసరం మేరకే ఎరువులు, పురుగుమందుల యాజమాన్యంపై అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

80 శాతం రాయితీపై విత్తనాలు

వ్యవసాయశాఖ 888 క్వింటాళ్ల విత్తనాలను సబ్సిడీపై రైతులకు సరఫరా చేశారు. తుపాను కారణంగా నారుమడులు నష్టపోయిన రైతులకు 453 క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేశారు. క్వింటాల్ ఖరీదు రూ.3,780 కాగా సబ్సిడీ ద్వారా రూ.13.70 లక్షల మేర రైతులకు లబ్ధి చేకూరింది. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద 50 శాతం సబ్సిడీపై 150 క్వింటాళ్ల ఫౌండేషన్ విత్తనాలను, ఐదు శాతం సబ్సిడీపై 285 క్వింటాళ్ల విత్తనాలను అందజేశారు. రైతుల అవసరం మేరకు ఆర్‌బీకేల వద్ద విత్తనాలను అందుబాటులో ఉంచినట్టు వ్యవసాయాధికారులు తెలిపారు.

అందుబాటులో ఎరువులు

ప్రస్తుత రబీ సీజన్‌లో 70 వేల టన్నులకు పైగా ఎరువులు అవసరమవుతాయని అంచనా. ఇప్పటికే సగానికి పైగా ఎరువులు జిల్లాకు చేరుకున్నాయి. 1,831 టన్నుల డీఏపీ, 13,198 టన్నుల యూరియా, 19,522 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 7,110 టన్నుల ఎస్ఎస్‌పీ, 2,734 టన్నుల ఎంఓపీ ఎరువులను వ్యవసాయశాఖ ఆర్‌బీకేలు, మార్క్‌ఫెడ్, హోల్‌సేల్, ప్రైవేట్ డీలర్లు, సొసైటీల వద్ద ఎరువులను అందుబాటులో ఉంచింది. అవసరమైన మేర మాత్రమే వినియోగించేలా ఎరువులను విక్రయిస్తారు.



అందుబాటులో ఉన్న ఎరువులు (టన్నుల్లో)

ప్రదేశం	డీఏపీ	యూరియా	కాంప్లెక్స్	ఎస్ఎస్‌పీ	ఎంఓపీ
ఆర్‌బీకే	103	1,924	781	59	369
మార్క్‌ఫెడ్	316	1,958	199	--	--
హోల్‌సేల్	774	3,281	13,164	5,523	1,570
ప్రైవేట్	365	3,726	2,857	1,103	691
సొసైటీలు	273	2,309	2,521	425	437

సిద్ధంగా ఎరువులు



జిల్లాలో రబీ పనులు మొదలయ్యాయి. దాదాపు 28 వేల హెక్టార్లలో నాట్లు వేసేందుకు నారుమడులను రైతులు సిద్ధం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగులో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లోని ఆర్‌బీకేలు, సొసైటీలు, డీలర్ల వద్ద ఎరువులు అందుబాటులో ఉంచాం.

– జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీ, పశ్చిమగోదావరి జిల్లా

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భీమవరం పర్యటనకు ముందస్తు ఏర్పాట్లను యుద్ధప్రాతిపదిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. భీమవరంలోని లూథరన్ హైస్కూల్ హెలీప్యాడ్ నుంచి సభాప్రాంతానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుందని, ముఖ్యమంత్రి ప్రయాణించే బస్సు మార్గంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. హెలీప్యాడ్ నుంచి సభాస్థలి వరకు సుందరీకరణకు ప్రాధాన్యమివ్వాలని, పార్కింగ్, హెలీప్యాడ్, సభాస్థలి వద్ద అంతర్గత రోడ్ల నిర్మాణాలు, బారికేడింగ్ తదితర ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పార్కింగ్ ప్రాంతాలను తెలిపేలా రూట్‌మ్యాప్‌లు, వాహనాలకు రోడ్ మ్యాప్‌లు సిద్ధం చేయాలన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి కృషి చేయాలని కోరారు. డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, ఆర్డీఓలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, డీఎస్పీ బి.శ్రీనాథ్, జిల్లాపరిషత్ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు పాల్గొన్నారు.

సమన్వయంతో 'ఆడుదాం ఆంధ్ర'



అధికారులకు సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం: జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో అధికారులు పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. భీమవరం కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఆడుదాం ఆంధ్ర, రీ సర్వే, అసైన్డ్ ఫ్రీహోల్డ్ భూములు, ప్రొక్యూర్మెంట్ తదితర అంశాలపై అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సోమవారం ఆడుదాం ఆంధ్రలో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో ఆటలు ప్రారంభించాలన్నారు. రిజిస్టర్ అయిన క్రీడాకారులను బృందాలుగా ఏర్పాటుచేయాలన్నారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు న్యూస్ కవరేజ్, ఇతర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆన్‌లైన్ సమస్యలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి వెంటనే పరిష్కరించుకోవాలన్నారు.

16 లక్షల గోనె సంచులు : ధాన్యం సేకరణకు సంబంధించి జిల్లాలో సుమారు 16 లక్షల గోనె సంచులు సమకూర్చి ప్రతిమండలానికి పంపామని జేసీ తెలిపారు. ఎక్కడా గోనె సంచుల కొరత లేకుండా ఆర్‌బీకే సిబ్బంది రైతులకు సకాలంలో అందించాలన్నారు. ఎఫ్‌టీఓ జనరేట్ చేసి రైతుల నుంచి ధాన్యం సేకరించాలన్నారు. ఆఫ్‌లైన్‌లో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ధాన్యం సేకరించాలని, ఫిర్యాదులకు ఆస్కారం ఇవ్వకూడదన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, ఆర్డీఓ కె శ్రీనివాసులురాజు, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్‌మాధుర్, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, డీఎస్ఓ ఎన్.సరోజ, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, డీఎల్‌డీఓ ఏవీ అప్పారావు, జిల్లా స్పోర్ట్స్ అధికారి ఎం.దుర్గారావు, కలెక్టరేట్ ఏఓ వైకేవీ అప్పారావు, సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్, ఏఎస్ఓ ఎం.రవిశంకర్ పాల్గొన్నారు.

సృజనకు సాన.. వైజ్ఞానిక ప్రదర్శన

భీమవరం అర్బన్: విద్యార్థుల్లో సృజనాత్మకను వెలికితీసేలా వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని, విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. చినఅమిరంలోని జెడ్పీ హైస్కూల్‌లో రెండు రోజులపాటు జరిగే జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మార్పులను అందిపుచ్చుకోవాలంటే సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలన్నారు. సీఎం జగన్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా సౌకర్యాలు కల్పిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భీమవరానికి చెందిన శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి వీఎంజెడ్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని 19 మండలాలకు చెందిన 8,9,10 తరగతుల విద్యార్థులు 60 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారన్నారు. వ్యక్తిగత, గ్రూపు, ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు కేటగిరీల్లో ప్రదర్శనలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు, జగన్నాథరాజు, హెచ్ఎం అనురాధ, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటరమణ



భవిష్యత్‌లో రోబోలదే రాజ్యం

అగ్నిమాపక శాఖ, ఆస్పత్రులు, మిలట్రీ, రెస్టారెంట్లు తదితర రంగాల్లో భవిష్యత్తులో రోబోలదే రాజ్యం. కరోనా సమయంలో కార్పొరేట్ ఆస్పత్రుల్లో బాధితులకు రోబోలు విశిష్ట సేవలందించాయి. భవిష్యత్తులో అన్నిరంగాల్లో రోబోల వాడకం బాగా పెరుగుతుంది. దీనిని తెలిపేలా ప్రాజెక్టు రూపొందించాను.

– ఎస్ భవానీ, 9వ తరగతి, కోపల్లె, కాళ్ల మండలం

రాకెట్‌లపై ఆసక్తితో..



ప్రస్తుత సమాజంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను గమనించి ముందుకు వెళ్లాల్సి ఉంది. శ్రీహరికోటలో రాకెట్ వ్యవస్థపై ఆసక్తి ఉండటంతో రాడార్, విద్యుత్‌శక్తి ఉత్పాదనలు అంశాలుగా నా మిత్రులతో కలిసి ఈ ప్రాజెక్టును తయారుచేశాను. ఐఏఎస్ కావడమే నా లక్ష్యం.

– ఎ జశ్వంత్, 9వ తరగతి, నెగ్గిపూడి, పెనుమంట్ర మండలం

సాగుకు సాయం

పంట రుణాలు	సున్నా వడ్డీ రుణాలు
రూ.820.30 కోట్లు	రూ. 12 కోట్లు 57,707 మందికి
కౌలు గుర్తింపు కార్డులు 59,638	రూ.295.68 కోట్ల రుణాలు


వైఎస్సార్ రైతు భరోసా: 1,24,645 మందికి రూ.137.57 కోట్లు

వైఎస్సార్ ఉచిత పంటల బీమా: 2,922 మందికి రూ.1.62 కోట్లు

ఇన్‌పుట్ సబ్సిడీ: 304 మందికి రూ.23.5 లక్షలు

యంత్ర పరికరాల పంపిణీ

వరికోత యంత్రాలు	10	బ్యాటరీ స్ప్రేయర్లు	62
ట్రాక్టర్లు	47	బండ్ ఫార్మర్	1
పవర్ టిల్లర్లు	328	కల్టివేటర్లు	6
గడ్డికట్టే మెషీన్లు	30	లెవిలింగ్ బ్లేడులు	2
రోటోవీటర్లు	31	ట్రాలీ	1



పంట నష్టం నివారణ చర్యల్లో ఉపాధి కూలీలు (ఫైల్)

అన్నదాతకు అగ్రపీఠం

వ్యవసాయాన్ని పండగ చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్నింటా అండగా నిలుస్తున్నారు. విత్తు నుంచి పంట విక్రయాల వరకూ చేయూత అందిస్తున్నారు. విపత్తుల సమయంలో గాయం మానేలా సాయం చేస్తూ అన్నదాతల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. జిల్లాలో 2023 వ్యవసాయ రంగానికి మిశ్రమ ఫలితాన్నిచ్చింది. సాగు చివరిలో విపత్తులు రైతులను ఇబ్బంది పెట్టగా.. ప్రభుత్వం ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లు, నష్ట నివారణ చర్యలతో ఆదుకుంది.

2023 రౌండప్ – వ్యవసాయం

రైతులకు అండగా ప్రభుత్వం

- చివరిలో వెంటాడిన వర్షాలు
- రబీలో అల్పపీడనం, ఖరీఫ్‌లో మిచాంగ్
- ముమ్మర ధాన్యం కొనుగోళ్లు, నష్టనివారణ చర్యలతో ఊరట
- జిల్లాలో రైతులకు రూ.144.35 కోట్ల సంక్షేమ లబ్ధి
- రూ.11.77 కోట్ల యంత్ర పరికరాల పంపిణీ
- రూ.1,128 కోట్ల పంట రుణాల మంజూరు

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో 2023 ఏడాది మొత్తంలో రైతులకు రైతుభరోసా, సబ్సిడీల రూపంలో ప్రభుత్వం రూ.144.35 కోట్ల లబ్ధిని చేకూర్చింది. అలాగే రూ.1,128 కోట్ల పంట రుణాలు, 40 శాతం సబ్సిడీపై రూ.11.77 కోట్ల విలువైన యంత్ర పరికరాలు అందజేసింది. రబీ నాట్లతో రైతులు 2023ను స్వాగతించగా 90 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. మే వరకూ సాగు పనులు జరగ్గా ఎప్పటికప్పుడు ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నారు. పంట చివరిలో వచ్చిన వర్షాలతో 346 ఎకరాల్లో నష్టం వాటిల్లగా నెలలోపు ప్రభుత్వం రూ.23.50 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీని అందించి ఆదుకుంది. 74,084 మంది రైతుల నుంచి 6.43 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించింది. రూ.1,312.23 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేసింది. రవాణా హమాలీ, గోనెసంచుల నిమిత్తం రూ.41.3 కోట్లు చెల్లించింది.

ఆశల ఖరీఫ్ : జూన్ రెండో వారంలో కాలువలకు నీరు విడుదలవ్వగా 2.13 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగుచేశారు. పంట చివరిలో మిచాంగ్ తుపాను విరుచుకుపడే సమాయానికి తాడేపల్లిగూడెం, గణపవరం, పెంటపాడు, పాలకొల్లు, పోడూరు, ఆచంట తదితర మండలాల్లో 1.05 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. తుపానుపై ముందుగానే అప్రమత్తమైన ప్రభుత్వం రైతులు నష్టపోకుండా యుద్ధప్రాతిపదికన ఆఫ్‌లైన్‌లో ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించింది. పొలాల్లో ముంపు నీటిని బయటకు మళ్లించేందుకు ఉపాధి కూలీలు, పొక్లయిన్లు, ఆయిల్ ఇంజన్లతో నష్టనివారణ చర్యలు చేపట్టింది. మిచాంగ్ ప్రభావంతో 31,486 మంది రైతులకు చెందిన 45,433 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు ప్రత్యేక కమిటీలు గుర్తించాయి. సోషల్ ఆడిట్ అనంతరం పంట నష్టపోయిన రైతులకు జనవరిలో దాదాపు రూ.30.89 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ సాయం అందించనుంది. ఇప్పటివరకు 44,491 మంది రైతుల నుంచి 2.92 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రూ.600 కోట్లు చెల్లించింది.

అడుగడుగునా అండగా..

ప్రభుత్వం ఏడాది పొడవునా పలురకాలుగా రైతులకు తోడ్పాటు అందించింది. రైతు భరోసా, పంటల బీమా, కౌలురైతులకు గుర్తింపు కార్డుల జారీ, రుణాల మంజూరు, విత్తనాల పంపిణీ, మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు, ఎలుకల నివారణ చర్యలు, యంత్రపరికరాల అందజేత వంటి వాటి ద్వారా రైతు సంక్షేమానికి కృషి చేస్తోంది. జిల్లాలోని 136 కస్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ) గ్రూపులకు రూ.11.77 కోట్ల విలువైన 518 యంత్ర పరికరాలు పంపిణీ చేసింది. 40 శాతం సబ్సిడీ ద్వారా రైతులకు రూ.4.51 కోట్లు లబ్ధిచేకూరింది.

ఉత్సాహంగా పొలంబడి: ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం 30 పొలంబడి కార్యక్రమాలు నిర్వహించింది. గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ (జీపీపీ) కింద గణపవరం మండలంలో 60 ఎకరాల్లో ప్రకృతి సాగును ప్రోత్సహిస్తోంది. అలాగే ఎలుకల నిర్మూలన కోసం రూ.13.06 లక్షల విలువైన మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేసింది.



పొలం వద్దకే వెళ్లి ధాన్యం సేకరిస్తున్న సిబ్బంది (ఫైల్)

సబ్సిడీపై విత్తనాలు

- ఖరీఫ్ సీజన్‌లో క్వింటాల్‌కు రూ.500 చొప్పున రూ.47 వేల సబ్సిడీపై 94 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశారు.
- గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద క్వింటాల్ రూ.3,810 చొప్పున 50 శాతం సబ్సిడీపై 187 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేయగా రైతులకు రూ.3,56,235 లబ్ధి చేకూరింది.
- రూ.5,57,000 విలువైన 50 క్వింటాళ్ల కంది విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు.
- రబీ సీజన్‌లో తుపానుతో నారుమడులు నష్టపోయిన రైతులకు 453 క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేశారు. క్వింటాల్ ఖరీదు రూ.3,780 కాగా సబ్సిడీ ద్వారా రూ.13.7 లక్షల మేర రైతులకు లబ్ధి చేకూరింది.
- అలాగే గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద 50 శాతం సబ్సిడీపై 150 క్వింటాళ్ల ఫౌండేషన్ విత్తనాల పంపిణీ ద్వారా రూ.2.84 లక్షలు, ఐదు శాతం సబ్సిడీపై 285 క్వింటాళ్ల విత్తనాల పంపిణీ ద్వారా రూ.1.43 లక్షల లబ్ధి రైతులకు చేకూరింది.



పంట నష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

క్లుప్తంగా

త్రోబాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



తాడేపల్లిగూడెం (టీఓసీ) : విజయవాడలో ఈ నెల 20, 21 తేదీలలో జరిగిన స్టేట్ త్రోబాల్ చాంపియన్ షిప్‌లో పశ్చిమ గోదావరి జిల్లా త్రోబాల్ టీం సభ్యులు ప్రతిభ చాటారు. వీరిలో జిల్లాకు చెందిన ముగ్గురు నేషనల్స్‌కు సెలెక్ట్ అయ్యారు. వీరిని త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ఏఆర్‌కే వర్మ, జనరల్ సెక్రటరీ ఎస్ఎం.శ్రీనాథ్‌లు అభినందించారు. విద్యార్థులు ఈ నెల 27 నుంచి 30 వరకు కోయంబత్తూరులో జరిగే నేషనల్ స్థాయి పోటీలలో పాల్గొంటారని వెల్లడించారు. బాలురు విభాగంలో బి.రవి తేజ, టి.రత్నకుమార్, బాలికల విభాగంలో పి.హర్షితలు ఎంపికయ్యారు.

నంది నాటకోత్సవాలకు న్యాయ నిర్ణేతగా మానాపురం



పాలకొల్లు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలకు న్యాయనిర్ణేతగా పట్టణానికి చెందిన పాలకొల్లు కళా పరిషత్ వ్యవస్థాపకుడు మానాపురం సత్యనారాయణ నియమితులయ్యారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 23 నుంచి 29 వరకూ నంది నాటకోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఏపి ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ తమ్మా విజయకుమార్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు.

అభిమానం.. రక్తదానం

- సీఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాలు
- జిల్లాలో 233 యూనిట్ల రక్తం సేకరణ



భీమవరంలో ప్రభుత్వ విప్ గ్రంథి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం(ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి జననేత జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానం చాటుకున్నారు. జిల్లాలో గురువారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజున జిల్లాలో పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. పార్టీ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటామని వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు మరోసారి నిరూపించారు.

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భీమవరంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని భీమవరం ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. పాలకొల్లులో పార్టీ ఇన్‌చార్జ్ గుడాల గోపి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించి సేకరించి రక్తాన్ని రెడ్‌క్రాస్ సంస్థకు అందించారు. ఆచంటలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తణుకులో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్ సంస్థకు అందించారు. తాడేపల్లిగూడెంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు.

నియోజకవర్గాల వారీగా రక్తదానం

నియోజవర్గం	యూనిట్లు
భీమవరం	87
ఆచంట	55
పాలకొల్లు	48
తణుకు	23
తాడేపల్లిగూడెం	20



పాలకొల్లులో పార్టీ ఇన్‌చార్జ్ గుడాల గోపి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం(ఫైల్)



వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా తణుకులో రక్తదానం చేస్తున్న యువత(ఫైల్)

అభిమానంతో రక్తదానం



సీఎం జగనన్న పుట్టినరోజు సందర్భంగా ఆయనపై అభిమానంతో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రోత్సాహంతో రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉంది. నా రక్తం ఆపదలో ఉన్నవారి ప్రాణాలను రక్షించడానికి ఉపయోగపడడం సంతోషం. జగనన్న పుట్టిన రోజున రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం వల్ల నాలాంటి అభిమానులు, యువత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

– వేండ్ర శ్రీరామ్, పడమటి పాలెం

రక్తదానం చేయడం సంతోషంగా ఉంది



సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉంది. గతేడాది కూడా రక్తదానం చేశాను. నా రక్తం ఆపదలో ఉన్న వారికి ఉపయోగపడుతుందంటే చాలా సంతోషం. జగనన్న పుట్టిన రోజున అభిమానులు, కార్యకర్తలు, యువత ఇచ్చిన రక్తం ఎంతో మందికి ఉపయోగపడుతుంది.

– చిగురుపాటి సందీప్, యూత్ నాయకుడు, చినఅమిరం

శోభాయమానం.. గిరి ప్రదక్షిణం



ధర్మప్రచార రథం వెంట గిరిప్రదక్షిణగా వెళ్తున్న భక్తులు



ధర్మప్రచార రథంలో కొలువైన స్వామి వారు

- క్షేత్రంలో వైభవంగా జరిగిన వేడుక
- వేలాదిగా పాల్గొన్న భక్తులు, గోవిందస్వాములు, కళాకారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో స్వామివారి గిరి ప్రదక్షిణోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, గజ, అశ్వ, వృషభ సేవల నడుమ జరిగిన ఈ వేడుక ఆద్యంతం కనుల పండువగా సాగింది. భక్తజనుల గోవింద నామస్మరణలతో క్షేత్ర పరిసరాలు మార్మోగాయి. తొలుత ఆలయ ప్రధాన కూడలిలో స్వామివారి ధర్మ ప్రచార రథాన్ని పుష్పమాలికలతో విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, పలువురు ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు రథంలో కొలువైన శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత చైర్మన్, ఈఓ జెండా ఊపి రథన్ని ప్రారంభించారు. స్వామివారి వైభవాన్ని చాటుతూ గజలక్ష్మి, అశ్వాలు, వృషభాలతో పాటు చిత్ర విచిత్ర వేషధారణలు, కోలాట భజనలు, డప్పు వాయిద్యాలు, శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీరామ వానర సైన్యం నాటిక ప్రదర్శనలు, కోలాట నృత్యాలతో గిరి ప్రదక్షిణ ముందుకు సాగింది. రథం వెనుక భక్తులు, గోవింద స్వాములు, వారి బంధుమిత్రులు వేలాదిగా పాల్గొన్నారు. గోవిందా.. గోవిందా.. అంటూ గిరి చుట్టూ పాదయాత్రగా తిరిగారు. దాతల సహకారంతో భక్తులకు ఆలయ అధికారులు మార్గమధ్యంలో పలు రకాల పండ్లు, పాలు, టీలు, మంచినీటిని అందించారు. ఈ గిరి ప్రదక్షిణోత్సవం క్షేత్రం నుంచి దొరసానిపాడు, రాళ్లకుంట రహదారి గుండా కొండపైకి, అక్కడి నుంచి ఉగాది మండపం మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. 5 కిలోమీటర్లు మేర అట్టహాసంగా, ఆడంబరంగా, వైభవోపేతంగా జరిగిన ఈ వేడుక భక్తులను పరవశింపజేసింది. భీమడోలు నుంచి గోవింద స్వాములు వేసుకొచ్చిన రథం గిరి ప్రదక్షిణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

తల్లిని కొట్టిన కేసులో జైలు శిక్ష

ఇరగవరం : తల్లిని కొట్టిన కేసులో ఇరగవరం గ్రామానికి చెందిన పాలా విజ్ఞేశ్వరరావుకు తణుకు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీ రంజిత్‌కుమార్ ఆరు నెలల జైలు శిక్ష విధించారని ఎస్సై డి.ఆదినారాయణ శుక్రవారం తెలిపారు. తల్లి పాలా జయలక్ష్మి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు. ఎస్సై డి.ఆదినారాయణ కేసు దర్యాప్తు చేశారు.

17,505 గిరిజన గృహాలకు ఉచిత విద్యుత్ మీటర్లు

సీతంపేట: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 3,761 గిరిజన గ్రామాల్లో 17,505 గృహాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ డైరెక్టర్ (ప్రాజెక్టులు) ఏవీవీ సూర్యప్రతాప్ తెలిపారు. విద్యుత్ కనెక్షన్లపై పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీలో జరుగుతున్న సర్వేను శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లోని ఏజెన్సీలో పీవీటీజీ గిరిజనులకు ఎన్ని కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు లేవనేదానిపై సర్వే చేస్తున్నామన్నారు. ఈ నెల 24 నాటికి సర్వే పూర్తవుతుందని చెప్పారు. ఆ తర్వాత ఉచిత విద్యుత్ మీటర్లు ఇచ్చి ప్రతి ఇంటికి విద్యుత్ సదుపాయం కల్పిస్తామని స్పష్టంచేశారు. ఏలూరులో 95 గ్రామాల్లో 409 ఇళ్లకు విద్యుత్ మీటర్లు లేవన్నారు. యుద్ధప్రాతిపదికన ఉచిత కనెక్షన్లు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇకపై 24 గంటలూ విద్యుత్ సరఫరాకు వీలుగా త్రీఫేజ్ సప్‌లై త్వరలో ఇస్తామన్నారు.

సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక రైళ్లు

ఏలూరు (టూటౌన్) : సంక్రాంతి పండుగ రద్దీని నియంత్రించే క్రమంలో దక్షిణ మధ్య రైల్వే కాకినాడ–కాచిగూడ మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు సీపీఆర్‌ఓ సీహెచ్ రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైన్ నెంబరు 07653 రైలు కాచిగూడ–కాకినాడ మధ్య ఈ నెల 28, జనవరి 4, 11, 18, 25 మధ్య నడుపుతున్నట్లు చెప్పారు. ట్రైన్ నెంబర్ 07654 రైలును ఈ నెల 29, జనవరి 5, 12, 19, 26 తేదీల మధ్య కాకినాడ–కాచిగూడ మధ్య నడుపుతున్నట్లు తెలిపారు. మొత్తం పది సర్వీసులను నడుపుతున్నామని ఈ రైలు కాచిగూడ, మల్కాజిగిరి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, కాకినాడ టౌన్ స్టేషన్ల మధ్య ఆగుతుందన్నారు. కాచిగూడలో రాత్రి 10.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5.10కు కాకినాడలో బయలు దేరి మరుసటి రోజు ఉదయం 4.50 గంటలకు కాచిగూడ చేరుకుంటుందని తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు జైలు శిక్ష

నూజివీడు: ఆర్టీసీ బస్సును అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి విద్యార్థి మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్ భీమవరపు దశరథరామిరెడ్డికి మూడు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2018 జూలై 4న ముసునూరు మండలం చింతలవల్లికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి సాయిరామ్ తన కోర్సుకు సంబంధించి సర్టిఫికెట్లు తీసుకునేందుకు ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడులోని ఇంజినీరింగ్ కాలేజీకి బైక్‌పై వెళ్తుండగా అదే మండలం వడ్లమాను వద్ద ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొంది. దీంతో విద్యార్థి రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆగిరిపల్లి పోలీసులు గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా పూర్వపరాలు పరిశీలించిన మీదట న్యాయమూర్తి డ్రైవర్‌కు జైలు శిక్ష, జరిమానా విధించారు.

అప్పల బాధ తాళలేక ఆత్మహత్య

భీమవరం: భీమవరం టూటౌన్ పరిధిలో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం ఇరగవరం మండలం రేలంగికి చెందిన గాలింగి రమేష్‌బాబు(34) కొంత కాలంగా ఆక్వా ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓటమి చెందాడు. భీమవరానికి కుటుంబంతోపాటు రెండు నెలల క్రితం అద్దెకు వచ్చాడు. ఎన్నికల్లో రూ.30 లక్షల వరకూ ఖర్చు చేయడంతో అప్పుల భారం భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులతోనే చనిపోతున్నానని, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని భార్యకు వీడియో కాల్‌చేసి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య క్రాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో 'అక్షింతల కలశాల స్పర్శ'



ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏలూరు దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో శ్రీరామ జయ మహా మంత్ర జపనామ స్మరణ మధ్య అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామపూజ అక్షింతల కలశ స్పర్శ కార్యక్రమం మంగళ వాయిద్యాల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏలూరు టౌన్ పరిధిలోని వివిధ ఆలయాల నుంచి వచ్చిన ఆలయ కమిటీలకు అక్షింతల కలశాలను అందజేశారు. కలశాలను ఆయా ఆలయాల్లో భద్రపరిచి జనవరి ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతి కుటుంబానికీ అక్షింతలు, శ్రీరామ మందిర నిర్మాణ నమూనా, విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను అందిస్తామని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ చక్రధర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో తపన ట్రస్ట్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, రేణుక దంపతులు, సంస్కృత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మైలవరపు వెంకట లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

క్లుప్తంగా

మౌలిక వసతులకు శంకుస్థాపన



తేతలి ఎస్టేట్‌లో పనులను ప్రారంభిస్తున్న ఇండస్ట్రియల్ చైర్ పర్సన్ వంక రాజకుమారి

తణుకు టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఐఐసీ ఆధ్వర్యాన ఇండస్ట్రియల్ ఎస్టేట్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో గల ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అభివృద్ధి పనులకు ఎస్టేట్ చైర్మన్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ వంక రాజకుమారి శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.10.10 కోట్ల నిధులతో రోడ్లు, డ్రెయిన్‌లతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డీజీఎం వైవీకే సుబ్బారావు, ఎస్టేట్ కోశాధికారి పి.సూర్యకుమారి, సభ్యులు అంగీర్ బాషా, పి.నరసింహమూర్తి, దుర్గారావు, కేవీఎస్ఎస్ మూర్తి, వై.శ్రీను, జి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



తణుకులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వలంటీర్లు

తణుకు అర్బన్: సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రజలకు అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తమ గౌరవ వేతనానికి అదనంగా మరో రూ.750లు పెంచిన సందర్భంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వద్ద మున్సిపల్ పరిధిలోని వలంటీర్లు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే సేవలో తమను భాగస్వాములను చేయడమే కాక గౌరవ వేతనం పెంచినందుకు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని అన్నారు.

ఆర్థిక సాయం అందజేత



వైఎస్సార్ బీమాను అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు: ప్రమాదబాధితులకు వెఎస్సార్ సీపీ ప్రభుత్వం నిత్యం అండగా ఉంటుందని పెంటపాడు గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ పేర్కొన్నారు. పెంటపాడు 10 వార్డుకు చెందిన తాడి శ్రీనివాసరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అతనికి వైఎస్సార్ బీమా వర్తింపు కార్యక్రమంలో భాగంగా రూ. 5 లక్షలు అందించేందుకు స్థానిక వైఎస్సార్ సీపీ ఏర్పాట్లు చేశారు. మట్టి ఖర్చుల కోసం రూ. 5 వేలు శుక్రవారం ఆమె భార్య రామలక్ష్మికి నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ మహిళా కమిషన్ సభ్యులు బూసి వినీత, చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌లు తెలిపారు. మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల తరగతి గదులు, మధ్యాహ్న భోజన పథకం పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాజారావు, సాంఘీక సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శివారు పొలాలకు తక్షణం సాగునీరు అందించాలి

పెంటపాడు: మండలంలోని శివారు ఆయకట్టు పొలాలు నాట్లు వేసుకొనేందుకు వీలుగా దుక్కులు చేసుకోసుకోవడానికి రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విప్పర్రు గ్రామానికి చెందిన పార్టీ అధ్యక్షుడు బోణం వీరయ్య, దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం మెంబర్ కోసూరి వెంకట్రాజు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు తదితరులు శుక్రవారం గోపీనాథపట్నంలో ప్రత్యేక పూజలలో ఉన్న మంత్రి కొట్టు సత్యనారాయణను కలిసి సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కళిరెడ్డి అబ్బాయి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం
- నందడిగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



తాడేపల్లిగూడెం రూరల్: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ముప్పిడి సంపత్‌కుమార్



తాడేపల్లిగూడెం అర్బన్: 26వవార్డులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలో వైఏపీ నీడ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పిడి సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. ప్రజలకు మంచి చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని ఆరోపించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేసిన పాలన వల్ల పార్టీ ఆవిర్భావం నుంచి అన్నివర్గాల ప్రజలు అన్ని వయస్సుల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో విజయం సాధించేది వైఎస్సార్‌సీపీనేనన్నారు. వివిధ పథకాలు అమలు తీరు, ప్రజల నుంచి వస్తున్న ఆదరణను ప్రతిపక్షం ఓర్వలేకపోతుందన్నారు. మోసపూరిత వాగ్దానాలకు తెరలేపారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రజలందరూ సహకరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, ఎంపీడీఓ ఎం విశ్వనాథ, ఈఓపీఆర్డీ ఎం వెంకటేషు, సర్పంచ్ తాడేపల్లి బేబి, కొమ్ముగూడెం సొసైటీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్, కొల్ల విజయలక్ష్మి కుమారి, చుండ్రు కృష్ణ, చిటికన మీరా, చిగురుపాటి పార్వతి, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కార్యదర్శి బి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం జగన్ లక్ష్యం

తాడేపల్లిగూడెం అర్బన్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని 26వ వార్డు ఇన్‌చార్జ్ చింతకాయల సత్యనారాయణ అన్నారు. శుక్రవారంలో వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన అనంతరం నవరత్నాల పథకాలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లక్షల రూపాయల లబ్ధిని అందించారని తెలిపారు. విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతో కుల, మత, వర్గ పార్టీల రహితంగా రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. ప్రజలందరూ సంక్షేమంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్ పడుతున్న తపన మరువలేనిదన్నారు. చంద్రబాబు పసుపు కుంకుమ పేరుతో మహిళలను మోసం చేశాడన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, మారిశెట్టి రమణ, పట్నాల గణపతి, చామన సూర్యచంద్రరావు, స్థానిక మహిళలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 14 మంది ఎంపిక



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ కళాశాలలో జేకేసీ, స్కిల్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 14 మందికి ఉద్యోగావకాశాలు లభించగా, మరో 19 మంది టెక్నికల్ రౌండ్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా. పి.అనిల్ కుమార్ తెలిపారు. శుక్రవారం తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో పలు ప్రముఖ కంపెనీలు తమకు కావలసిన వివిధ హోదాల్లో సిబ్బంది నియామకానికి పాల్గొనగా 100 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. వీరిలో 14 మంది అభ్యర్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక కాగా, 19 మంది టెక్నికల్ రౌండ్‌కు ఎంపికైనట్లు జేకేసీ కోఆర్డినేటర్ ఎం రఘునాథరెడ్డి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ డా. కే నాగభూషణ్‌రెడ్డిలు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆర్‌కే ఫణిదర్, జిల్లా స్కిల్ డవలప్‌మెట్ డీఎస్‌డీవో ఏ కృష్ణారెడ్డి, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ముక్కోటి ఆంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం



సీతారాములకు చామంతి పూజ చేస్తున్న మంత్రి కొట్టుసత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: గోపినాథపట్నం భక్తాంజనేయస్వామి ముక్కోటి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం అంకురార్పనతో ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం శ్రీరామచంద్రస్వామికి లక్ష చామంతులతో పూజ, వెంకటేశ్వరస్వామికి లక్ష తులసీ దళాలతో సహస్ర నామాలతో పూజ చేశారు. అమ్మవారికి కుంకమార్చన నిర్వహించారు. దేవదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణ సౌదినికుమారి దంపతులతోపాటుగా కుటుంబసభ్యులు పూజల్లో పాల్గొన్నారు. కోడిగూడెం భక్త సమాజం వారిచే హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. 23 వైకుంఠ ఏకాదశి ముక్కోటి కావడంతో ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి భక్తులకు అనుమతిస్తారు. ఈ సందర్భంలో విశేష పూజలు నిర్వహిస్తారు.

ఓటీపీలపై ప్రజలు తిరగబడుతుండడం వాస్తవమే కదా..



మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు తదితరులు

తణుకు అర్బన్: ప్రజాస్వామ్య వ్యవస్థలో మా ప్రభుత్వం వస్తే ఈ పనులు చేస్తామని చెప్పుకోవడాన్ని ప్రతి ఒక్కరూ ఆహ్వానిస్తారని, కానీ ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని దోచేసే అవకాశం ఉన్న ఓటీపీలను చెప్పమని అడగడం ఎంతవరకు సబబని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు ప్రశ్నించారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఓటీపీ వ్యవహారంలో ప్రభుత్వం, మంత్రి కారుమూరిపైనా చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి శుక్రవారం తణుకులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటీపీల వ్యవహారంలో ప్రజలే మీ కార్యకర్తలను నిలదీసి పోలీసులకు ఫిర్యాదు చేస్తుంటే మంత్రి కారుమూరి చేయిస్తున్నారని ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. టీడీపీ కార్యకర్తల వలన ప్రజలకు ఇబ్బందులు సృష్టించే ఏ వ్యవహారమైనా మంత్రి కారుమూరి చూస్తూ ఊరుకోరని ఎద్దేవా చేశారు. టెక్నాలజీని ఉపయోగించి నేటి రోజుల్లో ప్రతి రోజు ఎన్నో సైబర్ నేరాలు జరిగి అమాయక ప్రజలు మోసపోతున్న పరిస్థితుల్లో ప్రజల మొబైల్ నుంచి వచ్చే ఓటీపీలు తెలుసుకోవడం దుర్మార్గమన్నారు. ఓటీపీలు తెలుసుకోవడం నేరమని, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సవరు వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు చెబుతుంటే మీరు ఎర్రబుక్కులో మీ పేర్లు నమోదు చేస్తామని అధికారులను సైతం బెదిరించడం మీరు ఎంతమేర ఒత్తిడిలో ఉన్నారో తెలుస్తుందని అన్నా రు. జగన్ ప్రభంజనానికి ఒత్తిడికిగురై మీరు మాట్లాడే తీరు కూడా బాలేదని విమర్శించారు. రాజకీయాల్లో ప్రజలకు ఏ పార్టీ ఏం చేస్తుందో చెప్పుకోడాన్ని అన్ని పార్టీలు స్వాగతించాలి కానీ అమాయక ప్రజలను మోసం చేసే అవకాశమున్న ఓటీపీలను అడగడం దారుణమన్నారు. మీ పద్ధతి గాడి తప్పడం వలనే ప్రజలు పోలీసులను ఆశ్రయిస్తున్నారనే విషయాన్ని మీరు గుర్తుంచుకోవాలని, పోలీసులను అడ్డుపెట్టుకుని మీరు చేస్తున్నారని అనడం హాస్యాస్పదమని అధికారమే అడ్డుపెట్టుకుని ఉంటే ఫిర్యాదుల మేరకు కేసులు నమోదయ్యేవని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఎంపీపీ ఆర్.ధనరాజు, బోడపాటి వీర్రాజు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

గణిత మేధావి రామానుజన్



అత్తిలి: బల్లిపాడు హైస్కూల్‌లో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం

అత్తిలి: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని బల్లిపాడు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్ సీఎం దత్ సూచించారు. శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని హైస్కూల్‌లో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో హెచ్‌ఎం దత్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవి భవిష్యత్‌లో గణిత మేధావులు కావాలని ఆకాంక్షించారు. గణిత ఉపాధ్యాయులు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం, వై.శ్రీకాంత్‌లు రామానుజన్ జీవిత విశేషాలు, అంతర్జాతీయంగా ఆయనకు ఉన్న విశిష్టతను వివరించారు. గణితంలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.పురుషోత్తం, జి.శ్రీనివాసరావు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు శ్రీనివాస రామానుజన్

తణుకు టౌన్: ప్రపంచ వ్యాప్తంగా గర్వించదగ్గ మహామేధావి రామానుజన్ అని తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్‌కుమార్ చెప్పారు. జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని శ్రీనివాస రామానుజం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తణుకు రూరల్ మండలం వెంకట్రాయపురం మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో గణిత శాస్త్రవేత్తలు శ్రీనివాస రామానుజం, లక్కోజు సంజీవరాయ శర్మల జీవిత చరిత్రలను విద్యార్థులకు వివరించారు. పైడిపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామానుజమ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం ఏడుకొండలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీనివాస రామానుజన్ జయంతిని శుక్రవారం పెదతాడేపల్లి భారతీయ విద్యా భవన్స్ స్కూల్ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. విద్యార్థులు పలు ప్రదర్శనలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాధరాజు, సెక్రటరీ శ్రీకృష్ణంరాజు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ మెరుగైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం



ఆర్యోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

అత్తిలి: మెరుగైన వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి తేవడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆరోగ్యశ్రీ పథకంలో అందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ధ్యేయంతో ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం అత్తిలి మండలం సిన్నెరపురం గ్రామంలో కొత్తగా రూపొందిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ పథకంలో కుటుంబానికి ఏడాదికి రూ. 5లక్షల వరకు ఉండే చికిత్సా విధానం స్థాయిని నేడు రూ. 25 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించే విధంగా నూతన సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, సర్పంచ్ అడ్డాల భాను లలిత మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కూరాకుల లక్ష్మి, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తమ్మాబత్తుల సత్యనారాయణ, బీసీసెల్ మండల అధ్యక్షుడు రంభసూరిబాబు, ఎంపీడీఓ అమీలుజమా, వైద్యాధికారిణి చాముండేశ్వరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజల ఆరోగ్యమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ తెలిపారు. మండలంలోని మెట్ట ఉప్పరగూడెం సచివాలయం వద్ద శుక్రవారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.విశ్వనాథం, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, సర్పంచ్ మర్లపాటి వీర వెంకట సుబ్బలక్ష్మి, ఉప సర్పంచ్ రుద్రా అప్పారావు, వీరమళ్ళ సుబ్రహ్మణ్యం ఎం.చింతారావు, ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ గుమ్మాపు మేరీ, ఆరోగ్య మిత్ర ఎం.సునీత, జి.శరత్, డాక్టర్ ఎస్.శ్రీహర్ష, ఎ.ఎన్.ఎం పి.పోసమ్మ, ఆశా పి.వరలక్ష్మి, జి.పద్మ, పి. శ్రీరామ్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శామ్యూల్, కర్రి భాస్కరరావు

తాడేపల్లిగూడెం అర్బన్: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేద్దామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ తెలిపారు. ‘ఆడుదాం ఆంధ్రా’ పేరుతో ఈనెల 26 నుంచి తాడేపల్లిగూడెం మున్సిపాల్టీ పరిధిలో క్రీడా పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని వలంటీర్లు, సచివాలయ సెక్రటరీలతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ 2వ పట్టణ కన్వీనర్ కర్రి భాస్కరరావు మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, డబుల్స్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించే ఈ క్రీడాపోటీలకు సంబంధించి ఇప్పటికే క్రీడా సామాగ్రిని పంపిణీ చేశామన్నారు. ఈ క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, విద్యార్థులు సహకరించాలని కోరారు. మున్సిపల్ మేనేజర్ దివ్యకుమారి, చామన సూర్యచంద్రరావు, తాళ్ళూరి మురళి, కట్టా నాగరాజు, కావని అశోక్ పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు విద్యార్థుల ఎంపిక



విజేతలైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. పురుషుల కబడ్డీ పోటీల్లో సీహెచ్ హనుమంత్, ఆర్ఎస్ రాహుల్ ధనుష్, జి.హేమంత్‌కుమార్, ఎం.బాబ్జి, పవన్, గౌరీ ఈశ్వర్, కౌషిక్, వంశీ, అభిలాష్, సాయిబాబు, గీత్, వెంకటకౌషిక్‌లు మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. పురుషుల షాట్‌పుట్ విభాగంలో వై.పవన్ తేజా బంగారు పతకం, జావలీన్ త్రో విభాగంలో వై.పవన్ తేజా కాంస్య పతకం, 4 ఇన్‌టూ 100 రిలే పరుగులో మహిళల విభాగంలో ఎం.ప్రశాంతి, కె.జస్విత, సీహెచ్ విజయలక్ష్మి, ఎస్‌వీ దేవి ప్రియలు కాంస్య పతకాలు సాధించారు.

క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా సహాయ కార్యదర్శిగా రొక్కాల

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా సహాయ కార్యదర్శిగా రొక్కాల నాగ బుజ్జి ఎంపిక పట్ల పలువురు హర్షం ప్రకటించారు. జిల్లా సహాయ కార్యదర్శిగా ఎంపిక చేయడం పట్ల నాగ బుజ్జి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు, జిల్లా పార్టీ అధ్యక్షుడు చెరుకువాడ రంరాజుకు కృతజ్ఞతలు చెప్పారు. తన వంతుగా సేవలను అందిస్తానని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి, మోదుగ గుంట ఉప కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ మార్పు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో కుంచనపల్లి, ఎల్.అగ్రహారం, మోదుగ గుంట, కొండ్రుప్రోలు, మెట్ట ఉప్పరగూడెం, అప్పారావుపేట, గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి



తణుకులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

తణుకు అర్బన్: వైకుంఠ (ముక్కోటి) ఏకాదశికి తణుకు రాష్ట్రపతి రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు వేసి విద్యుత్ దీపాలను అమర్చారు. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యాన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. శనివారం ఉదయం తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారి దివ్య దర్శనం భక్తులకు కలుగజేయనున్నామని, రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దంపతులు స్వామివారిని దర్శించుకుంటారని చెప్పారు. ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు స్వామి, అమ్మవార్లకు పూజాధికాలు, కార్యక్రమాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

మదనగోపాలస్వామికి బంగారు పుష్పాలు



బంగారు పుష్పాలను ఆలయ అధికారులకు అందజేస్తున్న దాతలు

అత్తిలి: బల్లిపాడులోని ప్రసిద్ధ శ్రీ మదనగోపాలస్వామికి అర్ధ అష్టోత్తర బంగారు పుష్పాలను దాతలు శుక్రవారం బహుకరించారు. ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల బులినాగేశ్వరరావు వియ్యంకుడు దూసనపూడి గ్రామానికి చెందిన సవరం కృష్ణమూర్తి, మంగతయారు దంపతులు స్వామివారికి 54 బంగారు పుష్పాలను సమర్పించారు. ముందుగా వీటికి సంప్రోక్షణ, పూజాధికాలను ఆలయ అర్చకుడు పెద్దింటి సత్యనారాయణాచార్యులు నిర్వహించారు. అనంతరం వాటిని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత దంపతులను ఆలయ కమిటీ తరపున సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కళిరెడ్డి బాలాజీ, మాజీ సర్పంచ్ ఆకుల పండుస్వామి, ట్రస్టు బోర్డు చైర్మన్ తోట వెంకటేశ్వరరావు, మాజీ చైర్మన్‌లు ఆకుల బులినాగేశ్వరరావు, ధనుమూరి తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసనలు

అత్తిలి: అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అత్తిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరింది. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. సమ్మెకు సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరూరి మురళీకుమార్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గొల్లపల్లి అంబేడ్కర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కర్రి ధర్మేంద్ర, కౌలు రైతు సంఘం నాయకులు కేతా గోపాలన్ తదితరులు పాల్గొన్నారు.